క్లుప్తంగా

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గ లేటిపల్లి – కొత్తపేట సరిహద్దున వెలసిన గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే భక్తులు చన్నీటి స్నానాన్ని ఆచరించి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలతో అలంకరించగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పచ్చని చెట్ల మధ్య విందు భోజనాలను ఆరగించారు. ఆలయ ఆవరణలోని సాయిబాబా, వైద్య నాథీశ్వరుడు, నవగ్రహాలు, వీరభద్రుడు, ఆంజనేయస్వామిలకు పూజలు నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

కడప కల్చరల్ : కడప నగరం ఎన్జీఓ కాలనీలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి అష్టబంధన మహా కుంభాభిషేక సంప్రోక్షణ అనంతరం నూతన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగిందన్నారు. ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, అనంతరం అన్నదానం, సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ సీతారామయ్య, బాలనేతి రెడ్డయ్య, మెంటా సుబ్బరాయుడు, శ్రీరాములు, గంప పెంచలయ్య, నాగరాజు, అశోక్ కుమార్, పుత్తా శివరామయ్య, డి.ఓబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అవినాష్ రెడ్డి పూజలు



ఆలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ముద్దల పండుగలో ఎంపీ అవినాష్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో మేయర్



గంగమ్మ ఆలయంలో మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 28వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు కంటా భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గంగమ్మ జాతరకు మేయర్ సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.బి.అంజద్‌బాషాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగమ్మకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మణ్ రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవమార్గాన్ని అనుసరించాలి



ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు

కడప కల్చరల్: ప్రతి వ్యక్తి శాంతియుత వాతావరణంలో జీవిస్తూ దైవమార్గాన్ని అనుసరించాలని ప్రసంగీకులు పాస్టర్ గోర్ల ప్రసన్నకుమార్ తెలిపారు. స్థానిక మాసాపేట కొత్త కొట్టాలులోని ఎలీము ప్రార్థనా మందిరంలో పాస్టర్ దాసరి సుధాకర్, పాస్టరమ్మ సువర్ణమ్మల ఆధ్వర్యంలో ఆదివారం ఒక రోజు ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఆదర్శమైన జీవితాన్ని గడిపేందుకు కృషి చేయాలని సూచించారు. ఇందులో చర్చి సభ్యులు ఏసురత్నం, శరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

కడప అగ్రికల్చర్ : రైతులకు ఎరువుల వాడకంపై డీలర్లు అవగాహన కల్పించాలని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు మద్రిపాటి నాగరాజు పేర్కొన్నారు. కడప ఊటకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఆత్మ, వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుమందులు, విత్తన డీలర్లకు ఆదివారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీ మద్రిపాటి నాగరాజు మాట్లాడుతూ విత్తనాలను తీసుకునే రైతులకు డీలర్లు ఖచ్చితంగా బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త లు మానస, హిందుబిందు, వ్యవసాయ డీలర్లు పాల్గొన్నారు.

పల్లె వించిన ప్రగతి



నూతనంగా నిర్మించిన వీరపునాయునిపల్లె-కమలాపురం డబుల్ రోడ్డు



యస్.పాలగిరి గ్రామం వద్ద వాగులో నిర్మించిన వంతెన

కమలాపురం నియోజకవర్గం వీరపునాయునిపల్లె మండల వాసుల దశాబ్దాల కళ నెరవేరింది. టీడీపీ హయాంలో ప్రభుత్వ స్థలంలోనే కార్యాలయాల నిర్మాణం చేపట్టాలనే నిర్ణయంతో ఊరికి రెండు కిలో మీటర్ల దూరంలో మండల కార్యాలయ భవనాలను నిర్మించడంతో జనం నానా కష్టాలు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలను మండల కేంద్రం నడిబొడ్డున ఏర్పాటు చేస్తుండడంతో ప్రజల కళ నెరవేరినట్లయింది. దీనికి తోడు పల్లెల్లోనూ కార్యాలయాలు నిర్మించడంతో జనం కష్టాలు తీరాయి.

- వీరపునాయునిపల్లె

- మండల కేంద్రానికి కార్యాలయాల తరలింపు
- సంగమేశ్వర ఆలయానికి నూతన శోభ
- పల్లె వద్దే మెరుగైన వైద్యం అందేలా క్లీనిక్‌లు

వీరనాయనపల్లి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ చిన్న పని ఉన్నా మండల కేంద్రంలో బస్సు దిగి కాలినడకన వెళ్లాల్సి వచ్చేది. కాలక్రమేణా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో వెళ్తూ వందల రూపాయలు ఖర్చు పెట్టాల్సిందే. వర్షాకాలం సమయంలో వెళ్లే దారి పూర్తి బురదమయంగా మారి ప్రజలు ఇబ్బంది పడ్డారు. చాలా మంది వృద్ధులు ఎండా కాలంలో తాగేందుకు నీరు లేక స్పృహ కోల్పోయిన సందర్భాలు కోకొల్లలు. మండల కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలు దూరంగా ఉన్నాయని టీడీపీ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కార మార్గం దొరకలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కార్యాలయాలు మండల కేంద్రంలో నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు చివరిదశలో ఉన్నాయి. ఎన్నికలు పూర్తి కాగానే రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలు మండల ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



వీరపునాయునిపల్లె ప్రభుత్వ ఆసుపత్రి

గ్రామాణ ప్రాంతాల్లోని మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 'నాడు నేడు' కార్యక్రమంలో భాగంగా అత్యాధునిక పరికరాలు ఏర్పాటుచేయడంతో 24 గంటల పాటు వైద్యం అందేలా సిబ్బందిని నియమించారు. అంతే కాకుండా మండలంలో 15 సచివాలయాలు ఉండగా అందులో 14 సచివాలయాలకు అనుసంధానంగా 13 విలేజ్ క్లీనిక్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో విలేజ్ క్లీనిక్‌కు రూ.18 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. దీంతో ప్రభుత్వ అధికారుల సేవలు, వైద్యం అందుబాటులోకి వచ్చింది.



ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు

అందరూ చదవాలన్నదే ప్రభుత్వ సంకల్పం

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నదే ప్రభుత్వ సంకల్పం. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పాఠశాలలను అభివృద్ధి చేశారు. కార్పరేట్ పాఠశాలల్లో సౌకర్యాలకు తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనూ అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. నిరుపేదల పిల్లలు ఉన్నత విద్య సదివించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అమ్మ ఒడి, పీజు రీయంబర్స్‌మెంటు వసతి దీవెన పథకాలను అమలు చేస్తోంది. ప్రతి పిల్లవాడికి ఉన్నత విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.



సర్వరాజుపేట ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాల

శాశ్వత పరిష్కారం

మండలంలోని యస్.పాలగిరి గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. తేలికపాటి వర్షం కురిసినా.. ఊరు ముందర ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించి గ్రామం నుంచి బయటికి వచ్చేందుకు, వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. గ్రామం వెలసినప్పటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. గత ఏడాది ఇద్దరు గొర్రెల కాపరులు వాగులో కొట్టుకుపోయి ముళ్ల పొదల మధ్య పది గంటలపాటు ఊపిరి బిగబట్టుకుని గడిపారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కల్వర్టు నిర్మించి శాశ్వత పరిష్కార మార్గానికి చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులకు ఊరట లభించింది.

సంగమేశ్వర దేవాలయానికి మహర్దశ



సంగమేశ్వర దేవాలయం వద్ద నిర్మించిన టూరిజం విశ్రాంత గది

వీరపునాయునిపల్లె మండలంలోని అతి పూరాతనమైన సంగమేశ్వర దేవాలయానికి మహర్దశ నెలకొంది. గతంలో ఉన్న ప్రభుత్వాలు ఆలయ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దివంగత మహానేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టూరిజం గెస్ట్ హౌస్ నిర్మించారు. ఆయన మరణానంతరం ఆలయ అభివృద్ధి కుంటుపడింది. అంతే కాకుండా ఆలయానికి వచ్చేందుకు రహదారి సక్రమంగా లేక భక్తులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వీరపునాయునిపల్లె నుంచి సంగమేశ్వర ఆలయాల మీదుగా కమలాపురం వెళ్లేందుకు డబుల్ రోడ్డు నిర్మాణం, టీటీడీ సహకారంతో కళ్యాణ మండపం నిర్మించేందుకు చర్యలు చేపట్టడంతో ఆలయానికి నూతన శోభ సంతరించుకుంది.

బీజేపీని గద్దె దించేందుకు ప్రతిన బూనాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కార్మికుల హక్కులను కాలరాసే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మేడే రోజున ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ అధ్యక్షతన జరిగిన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యకర్తల సమావేశంలో వేణుగోపాల్ ఆదివారం మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానానికి స్వస్తి పలికి కేంద్ర ప్రభుత్వం 12 గంటల పని విధానం అమలులోకి తేవాలని ప్రయత్నించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్స్ గా కుదించడం చూస్తే కార్మికుల హక్కులు కాలరాయడమేనని తెలిపారు. మేడే ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఆశా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సి.అమ్ములు ఉపాధ్యక్షులు శోభారాణి, వరలక్ష్మి, అనిత ,జమునారాణి, జమీనా ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘ సంస్కరణ కోసమే 'కాళ్ళకూరి' నాటకాలు



రంగస్థల నటులను సత్కరిస్తున్న వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్ : నాటకకర్త కాళ్లకూరి నారాయణరావు తన రచనలను సమాజ సంస్కరణ కోసమే రాశారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాళ్ళకూరి నారాయణరావు జయంతి సందర్భంగా స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నారాయణరావు వేశ్యా వృత్తిని నిరసిస్తూ చింతామణి' నాటకం రాశారని, దాన్ని తెలుగు నాట వేలాది సార్లు ప్రదర్శించారని తెలిపారు. కాళ్లకూరి సాహితీ సేవల గురించి రంగ స్థల నటులు గంగయ్య, శ్రీనివాసరాజు, ఓబులేసు, బాల ఓబయ్య కొనియాడారు. అనంతరం కళాకారులు వెంకట రమణ, మండల మురళి, బాలపెంచలయ్య, రాయుడులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు

కడప అర్బన్ : కడప నగరంలోని కో–ఆపరేటివ్ కాలనీలో నివాసం వుంటూ ఆదివారం మామిడి కామేశ్వరమ్మ (72) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. శ్రీ కాశీ విశ్వనాథ సేవా సమితి, కడప వారి ఆధ్వర్యంలో ఆమె మృతదేహానికి అంత్యక్రియలు హిందూ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండ్లకొండ రవి, నాగుల రాం ప్రసాద్, రెడ్డి లక్ష్మణ్, గుండ్లకొండ రాఘవేంద్ర, టైలర్ రవి, బద్రి, దుబాయ్ కేఫ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. ఆదివారం 14వ డివిజన్‌లోని చంద్రమౌళీ నగర్, 1వ డివిజన్‌లోని మోడమీదపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె. బాబు పి. క్రిష్ణమూర్తి, బండి జకరయ్య, కె. వెంకట రమణ, శివ యాదవ్, రామ్మోహన్‌రెడ్డి, రత్నకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ, బి.మరియలు, విజయకుమారి, పాల్గొన్నారు.

బాబు మాటలు నమ్మితే మోసపోతాం

ప్రతి పక్షనేత చంద్రబాబు మాటలు నమ్మితే మోసపోతామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు అన్నారు. 7వ డివిజన్ శంకరాపురంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాబును నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పులి సునీల్, రాణాప్రతాప్, గంగరాజు, ప్రసాద్, ఆర్‌వీ రమణ పాల్గొన్నారు.

జగనన్న కోసం మేమంతా సిద్ధం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి తెచ్చుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అల్లుడు ఉమైర్ అన్నారు. 2వ డివిజన్ మారుతీనగర్, రాజారెడ్డి వీధుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా అంజద్‌బాషాను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోరామచంద్రయ్య, బంగారు నాగయ్య, ఎస్. సుబ్బారెడ్డి, యువజన నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

19వ వార్డులో..

కడప నగరంలోని 19వ వార్డులో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ హరీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజద్‌బాషాకు మద్దతుగాద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ.వెంకటేశ్వర్లు, దాసరి శివప్రసాద్, శ్రీరాములు, శ్రీనివాసులు, మస్తాన్ రాయల్, కిరణ్, రెడ్డిప్రసాద్, బి. శివకేశవ, రామక్రిష్ణ, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, స్వర్ణ కుమారి, మల్లీశ్వరి పాల్గొన్నారు.



చంద్రమౌళినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంజద్‌బాషా



22వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న అంజద్‌బాషా అల్లుడు ఉమైర్



7వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ సురేష్ బాబు



19వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మున్సిపల్ ఛైర్మెన్ హరీంద్రనాథ్ తదితరులు

నవరత్నాలు ప్లస్ మెనిఫెస్టో అద్భుతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికలను పురస్కరించుకుని ప్రకటించిన నవరత్నాలు ప్లస్ మెనిఫెస్టో అద్భుతం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి, సాయినాథ శర్మతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన మెనిఫెస్టోను భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటుచేశారన్నారు. రూ.25వేల జీతం వచ్చే ఉద్యోగులందరికీ వర్తించేలా మెనిఫెస్టోలో ప్రకటించారన్నారు. పండుగలకు గంగిరెద్దులు ఎలా వస్తాయో.. ఎన్నికలు వచ్చినపుడు హైదరాబాద్ నుంచి చంద్రబాబు, పవన్, లోకేష్, షర్మిల ఏపీలో అలా దిగుమతి అవుతారని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్, వైఎస్సార్, జగనన్న పేర్లు చెబితే చాలా పథకాలు గుర్తుకు వస్తాయని, చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకం పేరైనా గుర్తుకు వస్తుందా? అని ప్రశ్నించారు. వీర శివారెడ్డిమాట్లాడుతూ 2019 లాగే ప్రస్తుతం కూడా రాష్ట్ర ప్రజలు జగనన్నకు 151 సీట్ల కంటే ఎక్కువ మెజార్టీ కట్టబెట్టి ఆశీర్వదించాలన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ 2014లో చంద్రబాబు 680 హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేదని, జగనన్న 2019లో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో సాయినాథ శర్మ, అనిల్ కుమార్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. నందిమండలం గ్రామంలో ఎమ్మెల్యే కుమార్తె రమత్యారెడ్డి, అల్లుడు విజయభాస్కర్‌రెడ్డి, తమ్ముని కుమారుడు కృష్ణ సాయిరెడ్డితో కలిసి ఇంటింలా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి గడప చేరాలంటే జగనన్నను మరోసారి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లంచాలు లేకుండా పథకాలు చేరాయన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, చావలి శివ, రమణారెడ్డి, అనూరాధ, నాగేంద్రారెడ్డి, సురేష్, విజయభాస్కర్ రెడ్డి, రవి, గిరిధర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, దనుంజయరెడ్డి, వెంకటన్న, అనిల్‌కుమార్ రెడ్డి, అంజనేయులు, ఓబులేసు పాల్గొన్నారు.



నందిమండలంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



నందిమండలంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ